క్లుప్తంగా

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



పొన్నూరు: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఆర్.జి.రాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. యూనియన్ నాయకులు వేణుగోపాల్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ డిపో కార్యదర్శి ఏ.ఏ. బేగ్ మాట్లాడుతూ.. 1952 సంవత్సరంలో ఏర్పడిన ఎంప్లాయిస్ యూనియన్ ఇప్పటి వరకు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధించిందని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు, కరిముల్లా, ఎస్.రావు ట్రెజరర్ ఖాశీం, సంయుక్త కార్యదర్శి ఎస్కె. కరీముల్లా, టి.వి. రామయ్య, జి.రాణి, శివ, బుజ్జి, అమిరుల్ల, గ్యారేజీ నాయకులు ఎంపీ.రావు, లెనిన్, జి.ఆర్. బాబు, ఎల్. వెంకటేశ్వర్లు, మెకానిక్ నాగ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు ఇన్‌చార్జి ఎంఈఓగా కెన్నడీ



కాకుమాను: పెదనందిపాడు మండల ఇన్‌చార్జి మండల విద్యాశాఖాధికారిగా కె.ఎఫ్.కెన్నడీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం కాకుమాను మండల ఎంఈఓగా పనిచేస్తున్నారు. గతంలో ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన శ్రీనివాసరావు పెదనందిపాడు మండలంలోని పాలపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బదిలీ అయ్యారు.

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



కాకుమాను: పెదనందిపాడు మండలంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. పెదనందిపాడులో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాకుమాను మండలంలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రంలో కేవలం 5 గ్రామాలలోని రైతుల నుంచి మాత్రమే పొగాకు కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. పెదనందిపాడు మండలంలో 16 గ్రామాలలోని రైతులు పొగాకు సాగు చేశారని.. అయినప్పటికీ మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని.. కానీ నేటికీ దానిని ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని అన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు, నల్లమోతు రాజేంద్ర, పసుపలేటి శేషగిరిరావు, మదమంచి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవీగా కనకదుర్గమ్మ అమ్మవారు



నగరంపాలెం: స్థానిక సంగడిగుంటలోని శ్రీకనకదుర్గ అమ్మవారి గుడి ఆవరణలో అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవీగా అలకరించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందించారు. కనకదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి(రూప), కార్యదర్శి మూరబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆరవ ఆంజినేయులు, కోశాధికారి కల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పత్రి అప్పారావు, అరవపల్లి సాంబ శివరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

యువతి అనుమానాస్పద మృతి

లక్ష్మీపురం: భార్యాభర్తల మధ్య చిన్నపాటి వాగ్వివాదంతో భార్య ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనగర్ ప్రాంతానికి చెందిన ప్రత్తిపాటి ప్రవల్లిక(23) భర్త కంతేటి పవన్ కళ్యాణ్ 8 నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యాభర్త ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తున్నారు. సెల్‌ఫోన్ విషయంలో చిన్నపాటి వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో గురువారం అర్ధరాత్రి నిద్రపోతున్న గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీన్ని గమనించిన భర్త ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలంలో ఆత్మహత్య చేసుకున్న వైనాన్ని పరిశీలించి మృతురాలు ప్రవల్లిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారణ
- వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మాసోత్సవాలు



ప్రత్తిపాడులో డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రత్తిపాడు: డెంగీ పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. జాతీయ కీటకజనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ జాతీయ డెంగీ మాసోత్సవాలను నిర్వహిస్తుంది. అందులో భాగంగా శుక్రవారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం నుంచి మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. 102 కంటే జ్వర తీవ్రత అధికం, కీళ్లు, కండరాల నొప్పులు, వణుకు, బలహీనత, అలసట, చర్మంపై ఎర్రటి దద్దుర్లు ఇవన్నీ డెంగీ లక్షణాలని చెప్పారు. డీపీఎంఓ నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి, వాటిని శుభ్రపరచాలన్నారు. అదేవిధంగా నీటి నిల్వలపై మూతలు ఉంచాలని సూచించారు. జిల్లా మలేరియా కార్యాలయం సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. డెంగీ వ్యాధి లక్షణాలున్న వారు వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఎంపీహెచ్ఎస్ నరసింహారావు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పొన్నూరు: పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారించవచ్చని.. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల వద్ద శుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి టి.యం.కె. సుబ్బరాయనమ్ అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ, పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయనమ్ మాట్లాడుతూ.. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' పాటించి వారానికి ఒకసారి పరిసరాలను శుభ్రం చేసుకొంటే దోమల ద్వారా వచ్చే వ్యాధులను పూర్తిగా అరికట్టవచ్చునని తెలిపారు. డెంగీ నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శ్రావ్య కాలేజ్ నర్సింగ్ విద్యార్థులు, సహాయ మలేరియా అధికారి ప్రభాకర రెడ్డి, వైద్యాధికారి డాక్టర్.అలేఖ్య, శివ గణేష్, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రియదర్శిని కళాశాలకు అటానమస్ హోదా



సమావేశంలో మాట్లాడుతున్న చందు విజయలక్ష్మి

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి అటానమస్ హోదా లభించిందని కళాశాల సెక్రటరీ చందు విజయలక్ష్మి తెలిపారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత కొద్ది సంవత్సరాలుగా కళాశాలలో విద్యా నైపుణ్యాల మెరుగుదల, సాంకేతిక విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో 2024 విద్యా సంవత్సరంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి 2(ఎఫ్) హోదా లభించిందన్నారు. అదే ఏడాది నాక్, బిప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించామని చెప్పారు. తాజాగా 2025లో మరో రెండు మైలు రాళ్లు కళాశాల జాబితాలో చేరాయని.. అందులో ఒకటి యూజీసీ నుంచి స్వయంప్రతిపత్తి హోదా పొందడం.. రెండోది జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ(జేఎన్‌టీయూకే) నుంచి అటానమస్ హోదా పొందడమన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.వి.ఎస్. ఫణికుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.కిరణ్‌కుమార్, ఎంబీఏ డైరెక్టర్ చందు రవి తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

చేబ్రోలు: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బోయపాలెం డైట్ కాలేజిలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో శుక్రవారం జరిగిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కె.బిందు తేజ 'మాదకద్రవ్యాలు పొగాకు నిషేధం' అనే అంశంపై జరిగిన చిత్రలేఖనంలో ప్రథమ స్థానం సాధించి రూ.1500 నగదు అవార్డు గెలుపొందింది. వ్యాసరచనలో 'లింగ సమానత్వం గౌరవం' అంశంపై ఎం.దీక్షిత జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రూ.1000 నగదు గెలుపొందారు. బాలికకు నగదుతో పాటు సర్టిఫికెట్‌ను డైట్ కళాశాల ప్రిన్సిపాల్, నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారి సుబాని అందించారు. బహుమతులు సాధించిన ఇరువురు విద్యార్థులను పలువురు అభినందించారు.

అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలి

- మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం
- సమావేశంలో పాల్గొన్న అనధికార ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

పెదకాకాని: అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో అభివృద్ధి పనుల చేసే వ్యవహారంలో కొందరు అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని.. ఇది మంచిది కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 9 నెలల కిందట మండలంలో అభివృద్ధి పనులకు సుమారు రూ.1.50 కోట్లు మండల పరిషత్ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులకు ఎక్కడ.. ఏ పనులు చేపట్టారు.. పూర్తి అయ్యాయా.. ఎన్ని పనులు పూర్తి చేశారు అనే ప్రశ్నకు సమాధానం లేదన్నారు. అనంతరం అధికారులు శాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

సగం మంది గైర్హాజరు..

మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశానికి సగానికి పైగా ప్రజా ప్రతినిధులు, అధికారులు గైర్హాజరయ్యారు. శాఖల వారీగా సమాధానం చెప్పాల్సిన అధికారులు కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో సమావేశం సాదాసీదాగా ముగించారు. ఈ సభలో పలువురు అనధికార వ్యక్తులు సమావేశంలో పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచండి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ

జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు త్వరితగతిన కోలుకునేందుకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. మీకోసం – మేము అనే కార్యక్రమం 21వ వారం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ రోగులు, వారి సహాయకులతో మాట్లాడారు. ఆస్పత్రి ఆవరణలో వాహనాలపై తిరగకూడదని, కాలుష్యం పెరిగి చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్యానికి ఇబ్బంది ఏర్పడుతుందని చెప్పారు. రోగి మంచాలపై సహాయకులు కూర్చొకూడదని, ఒకరు మాత్రమే రోగికి సహాయకులుగా వార్డులో ఉండాలన్నారు. వైద్య పరీక్షలన్ని ఉచితంగా చేస్తారని, ఎవరికి డబ్బులు చెల్లించాల్సిన పనిలేదని, ఎవరైనా డబ్బులు అడిగితే రసీదు తీసుకోవాలన్నారు. చికిత్స పొందుతున్న రోగులకు రక్తం ఎక్కించేందుకు వారి కుటుంబ సభ్యులు రక్తదానం చేయాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా రక్తం ఇస్తామని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు జాగృతి సంస్థ సహకారంతో సూపరింటెండెంట్ బియ్యం పంపిణీ చేశారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బి.వి.రావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్యాజువాల్టికి పాముకాటు, గడ్డిమందు తాగిన కేసులు ఎక్కువగా వస్తున్నాయని వివరించారు. అత్యవసర చికిత్సల కోసం వచ్చేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై రోగుల సహాయకులకు వివరించారు. నూతనంగా గేట్‌పాస్ విధానం తీసుకొచ్చామని, ఆస్పత్రిలోపలకు వచ్చేవారు, సెక్యూరిటీ సిబ్బందికి గేట్ పాస్ చూపించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

కాకుమాను: కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయా మండలాల ఏఈలు సయ్యద్ మౌలాలి ఖాన్, కరుణాసర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకుమాను మండలంలోని కాకుమాను, చినలింగాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు.. పెదనందిపాడు మండలంలోని పెదనందిపాడు, వరగాని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు తెలిపారు. 11కేవీ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాసరిపాలెం సబ్‌స్టేషను పరిధిలోని చౌడవరం, దాసరిపాలెం, ఓబులనాయుడుపాలెం, నాయుడు పేట గ్రామాల్లో.. కేవీపీ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసరావుతోట, ఎంజీ నగర్, 60 ఫీట్ రోడ్, కృష్ణబాబు కాలనీ, జోసెఫ్ కాలనీ, వీఐపీ రోడ్, చుట్టుగుంట ప్రాంతాల్లో.. న్యూ లాల్‌పురం సబ్ స్టేషను పరిధిలోని లాల్‌పురం, వై జంక్షన్, లింగయ్యపాలెం గ్రామాల్లో.. పొత్తూరు సబ్‌స్టేషను పరిధిలోని పొత్తూరు, ఓబులనాయుడుపాలెం, అంకిరెడ్డిపాలెం, చల్లావారిపాలెం, ఆదర్శనగర్ గ్రామాల్లో రెండో శనివారం సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చేబ్రోలు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ మరమ్మతులు, రెండో శనివారం మరమ్మతుల నిమిత్తం చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ సమావేశం

చేబ్రోలు: పొన్నూరు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని చేబ్రోలు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సూచనల మేరకు.. బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. చేబ్రోలులోని పరిమి సత్యనారాయణ కల్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణతో పాటు పలువురు జిల్లాలోని ముఖ్య నాయకులు అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు అందరూ హాజరు కావాలని ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం!

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో నెహ్రూనగర్ ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో ఇప్పటికే రేషన్ బియ్యం తరలిస్తున్న కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బియ్యాన్ని తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు వంద బస్తాల రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

జనాభా నియంత్రణతో ప్రకృతి వనరుల సంరక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: జనాభా పెరుగుదలతో ప్రకృతి వనరులు తరిగిపోతున్నాయని గుంటూరు జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్-స్వశక్తి) మేనేజర్ బి.రాధిక పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి మాట్లాడుతూ జనాభా నియంత్రణ లేకుండా పెరిగిపోతుండటం వలన గ్రామీణ, అటవీ ప్రాంతాలు, పంట భూములు తరిగిపోయి పట్టణ ప్రాంతాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా పెరుగుతున్న జనాభాకు సరిపడా వనరులు అందుబాటులో లేని పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అధ్యాపకులు పద్మజ, సరోజ మాట్లాడుతూ 1997 నుంచి ప్రపంచ వ్యాప్తంగా జనాభాను లెక్కించే పద్ధతిని ప్రారంభించారని, జనాభా పెరుగుదల ప్రకృతి వనరులపై ప్రభావాన్ని చూపే అంశాలను వివరించారు.

వైఎస్సార్ సీపీ మండలాల
అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



పొన్నూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం 'పొన్నూరు నియోజకవర్గంలోని పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పొన్నూరు మండలం..

యువజన విభాగం అధ్యక్షుడిగా బుద్దా బీరయ్య, మహిళా విభాగం కూచిపూడి మరియారాణి, రైతు విభాగం నూతలపాటి రామకృష్ణ, బీసీ సెల్ ముద్రబోయిన తిరుపతయ్య, ఎస్సీ సెల్ పొనుగుపాటి పాల్ రాజ్, ఎస్టీ సెల్ పాలపర్తి హరిబాబు, మైనారిటీ సెల్ షేక్. మౌలాలి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ దండమూడి కృపానందం, స్టూడెంట్ విభాగం కనపర్తి శేఖర్, పంచాయతీరాజ్ విభాగం కందుల పవన్‌కుమార్, ఆర్టీఐ విభాగం ఆరెమండ ప్రదీప్, వాలంటీర్స్ విభాగం కట్టా రమేష్, ఫిర్యాదు విభాగం బోయిన ప్రవీణ్, చేనేత విభాగం నల్లమల రమేష్‌బాబులను నియమించారు. అలానే వాణిజ్య విభాగం చెట్టుపల్లి వెంకట కృష్ణమూర్తి, వైఎస్ఆర్‌టీయూసీ విభాగం రుద్రపాటి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ విభాగం జంగా సామధానం, లీగల్ విభాగం పిల్లి విజయ్‌కుమార్, సాంస్కృతిక విభాగం కట్టా సత్యం, సోషల్ మీడియా విభాగం మెరిగల సతీష్, దివ్యాంగుల విభాగం సబాసు ఈశ్వరయ్య, వైద్యుల విభాగం మామిళ్లపల్లి వెంకట మోహనరావు, మేధావులు ఫోరం విభాగం భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రచార విభాగం తురుమెళ్ల రాజశేఖర్, బూత్ కమిటీ విభాగం అమిరినేని రామారావు నియామకం అయ్యారు.

పెదకాకాని మండలం..

యువజన విభాగం అధ్యక్షుడిగా పొందుగుల కమల్ కుమార్, మహిళా విభాగం షేక్.హహనాజ్, రైతు విభాగం ఆరాధుల బ్రహ్మం, బీసీ సెల్ చింతా కుమారస్వామి, ఎస్సీ సెల్ పెరుమాళ్ల అనిల్‌కుమార్, ఎస్టీ సెల్ మేడా నాగేశ్వరరావు, మైనారిటీ సెల్ షేక్.జానిబాష, క్రిస్టియన్ మైనారిటీ సెల్ దిడ్లా దేవదాస్, స్టూడెంట్ విభాగం వెసిపోగు రాజశేఖర్, పంచాయతీరాజ్ విభాగం పిట్టు శివకృష్ణారెడ్డి, ఆర్టీఐ విభాగం భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వాలంటీర్స్ విభాగం చిడిపూడి వెంకటరెడ్డి, ఫిర్యాదు విభాగం పెండెం విజయబాబు, చేనేత విభాగం పెండెం భద్రయ్యలను నియమించారు. అలానే వాణిజ్య విభాగం ఎస్.డి.ఆరీఫ్, వైఎస్ఆర్‌టీయూసీ విభాగం షేక్.మస్తాన్‌వలి, అంగన్‌వాడీ విభాగం బంకా జయమేరి, లీగల్ విభాగం చలిమడుగు చంద్రశేఖర్, సాంస్కృతిక విభాగం పులగం నాగిరెడ్డి, సోషల్ మీడియా విభాగం నంబూరి తిరేంద్రబాబు, ఐటీ విభాగం అద్దెపల్లి సురేష్, దివ్యాంగుల విభాగం ఎస్.డి.అల్లాదీన్, వైద్యుల విభాగం షేక్.హబీబుల్లా, మేధావులు ఫోరం విభాగం రెడ్డి నాగేశ్వరరావు, ప్రచార విభాగం పల్లె నరేష్‌బాబు, బూత్ కమిటీ విభాగం సుంకర నర్సిరెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన మండల అనుబంధ విభాగాల అధ్యక్షులకు వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.

చేబ్రోలు మండలం..

యువజన విభాగం అధ్యక్షుడిగా అల్లం వెంకటరామయ్య, మహిళా విభాగం యాతం మమత, రైతు విభాగం భవనం పుల్లారెడ్డి, బీసీ సెల్ గుర్రం శంకరరావు, ఎస్సీ సెల్ పల్లెంపాటి కోటేశ్వరరావు, ఎస్టీ సెల్ దాసరి రాంబాబు, మైనారిటీ సెల్ షేక్.జానిమాము, క్రిస్టియన్ మైనారిటీ సెల్ వెల్లబాటి రమేష్‌బాబు, స్టూడెంట్ విభాగం కొక్కిలిగడ్డ రేవంత్, పంచాయతీరాజ్ విభాగం చుక్కా నాగేంద్రబాబు, ఆర్టీఐ విభాగం కాకాని రవీంద్రబాబు, వాలంటీర్స్ విభాగం షేక్.ఖాశీం పీరా, ఫిర్యాదు విభాగం బత్తుల బ్రహ్మయ్య, చేనేత విభాగం రవిరాల శ్రీదేవి నియమితులయ్యారు. అలానే వాణిజ్య విభాగం ఉగ్గం వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్‌టీయూసీ విభాగం దానబోయిన గోపి, అంగన్‌వాడీ విభాగం యాదాల జయశ్రీ, లీగల్ విభాగం ఉయ్యూరు శివనాగ మల్లేశ్వరరావు, సాంస్కృతిక విభాగం నెమలికంటి అనిల్, సోషల్ మీడియా విభాగం జైపాల్ రెడ్డి, దివ్యాంగుల విభాగం సీహెచ్.వీరాంజనేయులు, వైద్యుల విభాగం కారుమూరి నాగేశ్వరరావు, మేధావులు ఫోరం విభాగం పాలడుగు నరేష్, ప్రచార విభాగం అన్నదాసు వెంకటేశ్వర్లు, బూత్ కమిటీ విభాగం కొల్లి శేషిరెడ్డి నియమితులయ్యారు.

మత్తు వదలరా.. నిద్దుర మత్తు వదలరా!



ఆకలి రుచి యెరుగదు.. నిద్ర సుఖమెరుగదని..! ఈ చిత్రంలో ఆటోలో ప్రయాణిస్తున్న వీరి నిద్ర కూడా ఆ తోవకు చెందినదే. పొద్దంతా కష్టపడి పనిచేశారో ఏమో.. ఆదమరిచిన ఈ శ్రామికులు ఇదిగో ఇలా ఆటో వెనుక కూర్చుని కొందరు. ఆటో టాప్‌పైన కూర్చుని మరికొందరు ప్రమాదకరంగా నిద్రపోతున్నారు. పొరబాటున పట్టుతప్పినా.. ఆటో డ్రైవర్ సడన్ బ్రేకు వేసినా ప్రమాదం బారిన పడే అవకాశం లేకపోలేదు. ఈ చిత్రం గుంటూరు-పర్చూరు పాతమద్రాసు రోడ్డులో పుల్లడిగుంట సమీపంలో కనిపించింది.

– ప్రత్తిపాడు

కమ్యూనిటీ టాయిలెట్స్ ప్రారంభం



కమ్యూనిటీ టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి

నెహ్రూనగర్: నగరంలో ఐటీసీ బంగారు భవిష్యత్ నగరపాలక సంస్థతో కలిసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం, స్కూల్స్‌లో డైనింగ్ హాల్స్ నిర్మాణం చేయడం అభినందనీయమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఐటీసీ బంగారు భవిష్యత్ సంస్థ నిర్మాణం చేసిన స్థానిక ఎన్జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్లో విద్యార్థినుల కోసం డైనింగ్ హాల్, తుఫాన్ నగర్‌లో కమ్యూనిటీ టాయిలెట్స్‌ను ప్రారంభించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఐటీసీ గుంటూరు నగరంలో పలు సేవా కార్యక్రమాలు, ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించడానికి నగరపాలక సంస్థతో కలిసి కృషి చేస్తుందన్నారు. ప్రధానంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై ప్రజలకు అవగాహన కలిగించడంలో ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. తుఫాన్ నగర్‌లో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం ద్వారా సుమారు 35 పేద కుటుంబాలు నివసించే ప్రాంతంలో బహిరంగ మలమూత్ర విసర్జన లేకుండా చేశారని చెప్పారు. ఎన్జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్‌లో ప్రత్యేకంగా విద్యార్థినుల కోసం సుమారు రెండు వందల మంది సామర్థ్యంతో డైనింగ్ హాల్ నిర్మాణం చేయడం అభినందనీయమని చెప్పారు. సదరు స్కూల్‌లో తడి వ్యర్థాలను 45 రోజుల పాటు శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి, ఎరువు తయారు చేసి, మొక్కలకు వినియోగిస్తున్నారని వివరించారు. ఐటీసీ ఏబీడీ వైస్ ప్రెసిడెంట్ వీరా స్వామి మాట్లాడుతూ తుఫాన్ నగర్‌లో రూ.12 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్, ఎన్జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్‌లో రూ.8 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం చేసి చేయడం జరిగిందన్నారు.

సనాతన ధర్మం జీవన విధానం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై శుక్రవారం సనాతన ధర్మం-జీవన మార్గంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్కృత భారతి సభ్యులు ఉపద్రష్ట లక్ష్మణసూరి మాట్లాడారు. సనాతన ధర్మం మతం కాదని జీవన విధానమని అన్నారు. ప్రకృతిని ఆరాధించే సంస్కృతి మన సంప్రదాయమని పేర్కొన్నారు.